# అభివృద్ధికి అండగా నిలవాలి

- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో సామాన్యులకు మేలు
- దళితుల ఆర్థికాభివృద్ధికే 'దళిత బంధు'
- ప్రగతిని ఆశీర్వదించి మరో అవకాశం ఇవ్వాలి
- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తి దళితవాడలో ఇంటింటి ప్రచారం చేసిన మంత్రి
- బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన దళితవాడ మహిళలు

దళిత వాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి



వనపర్తి, నవంబర్ 4 : సామాన్యులకు మేలు జరిగే విధంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మారెమ్మకుంట నుంచి గాంధీనగర్ వరకు శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్‌తో కలిసి మంత్రి ఇంటింటి ప్రచారం చేస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రజా సంక్షేమ దిశగా ప్రయాణిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆసరా పింఛన్ కాక అర్హులైన మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద రూ.3 వేలను అందించనున్నారని తెలిపారు. అలాగే వచ్చే ఏడాది మే నుంచి పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలన్నీ ఓట్ల కోసమే దళితులను వాడుకున్నారని, వారి బాగోగుల కోసం ఆలోచించిన పాపాన పోలేదన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం దళితులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో దళిత బంధు పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో ప్రస్తుతం ఈ పథకం కింద లబ్ధిదారులు సొంత ఉపాధిని ఏర్పాటు చేసుకొని సగౌరవంగా జీవిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయలేని విధంగా అభివృద్ధి చేసిన తనను ఆశీర్వదించి, మరోసారి గెలిపించాలని కోరారు. రైతుబీమా, రైతు బంధు, వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌తో వ్యవసాయాని పం డుగగా మారిందని, పంట దిగుబడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారానికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రం, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కొనసాగాలంటే మళ్లీ కేసీఆరే రావాలన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ కారుగుర్తుకు ఓటేసీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. దళితవాడలో గుడిలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దళిత వాడలోని మహిళలు పెద్ద ఎత్తున మంత్రికి స్వాగతం పలికి తామందరం బీఆర్ఎస్ పార్టీకే మద్దతుగా ఉంటామని తెలిపారు. ప్రచారం లో పట్టణ ఎన్నికల సమన్వయకర్త అరుణ్‌ప్రకాశ్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు సత్యమ్మ, శరవంద, కృష్ణ, పాకనాటి కృష్ణ, పుట్టపాకుల మహేశ్, కంచెరవి, మీడియా సెల్ శ్యామ్, అశోక్, నాయకులు పరంజ్యోతి, గంధం విజయ్, మందరాము, కృష్ణయాదవ్, రహీం, తిరుమల్, గులాం ఖాదర్, బాలరాజు, మురళీ, శ్రీను, ఉస్మాన్, మునీకుమార్, గౌస్, కురేసి, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఖర్చు నమోదు చేయాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలి
- దినపత్రికల్లో వచ్చే వార్తలపై దృష్టి సారించాలి
- సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్‌కుమార్ ఝా
- పీవో, ఏపీవోలను నియమించాం: కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఐదు చెక్‌పోస్టులలో నిఘా పెంచాం..
- ఎస్పీ రితిరాజ్

గద్వాల, నవంబర్ 4 : నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అయ్యే ఖర్చులను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్‌కుమార్‌ఝా అన్నారు. శనివారం ఐడీవోసీ సమావేశ హాల్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితిరాజ్, అదనపు కలెక్టర్లు శ్రీనివాసులు, అపూర్వచౌహాన్‌తో కలిసి వ్యయ పరిశీలకులు, నోడల్ అధికారులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీడియో సర్వేలైన్స్, అకౌంటింగ్ టీం సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని ఐటీ, బ్యాంక్ అధికారులను ఆదేశించారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లు నమోదు చేయాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాలు



సీవిజిల్ యాప్, కాల్ సెంటర్ ను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు

నిర్వహించినా, పార్టీ ప్రచారం చేసినా ధరల ప్రకారం ఖర్చులు నమోదు చేయాలన్నారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించినట్లు ప్రింటర్, ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్య చట్టం 127సీ ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఎంసీ ఎంసీ కమిటీ ద్వారా రోజు వారీ దినపత్రికల్లో వచ్చే న్యూస్‌పై దృష్టి సారించాలని, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఓటర్లను ప్రలోభ పర్చే డబ్బు, మద్యం పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. బ్యాంక్ లావాదేవీలు రూ.10లక్షలకు మించి నగదు జమ, ఉపసంహరణ ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు, సీ విజిల్ యాప్‌పై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు సంబంధించి 12 మండలాలకు పీవో, ఏపీవోలను నియమించామన్నారు. ఓటర్ అవగాహనపై స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం, సువిధ పోర్టల్ నమోదుపై రాజకీయ పార్టీల వారికి అవగాహన కల్పించామన్నారు. ఓటర్ గుర్తింపు కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫారం–6, 8 ద్వారా నమోదైన ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డులు జిల్లాలకు 40వేలు వచ్చాయని చెప్పారు. ఎస్పీ రితిరాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు చెక్ పోస్టులలో నిఘా ఉంచామన్నారు. తనిఖీలు ముమ్మరం చేశామని, అక్రమంగా మద్యం తరలించే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అనంతరం సీ విజిల్, టోల్ ఫ్రీనంబర్ 1950, కాల్ సెంటర్ తదితర వాటిని ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## రెండో రోజూ నిల్

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల, నవంబర్ 4 : సాధారణ ఎన్నికల నామినేషన్లలో భాగంగా గద్వాల అసెంబ్లీ నియోజకవర్గానికి శనివారం ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి అపూర్వచౌహాన్ తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకు గద్వాల రిటర్నింగ్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అలంపూర్‌లో ఒక నామినేషన్

అలంపూర్, నవంబర్ 4 : అలంపూర్ నియోజకవర్గం నుంచి శనివారం ఒక్క నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ తెలిపారు. అయిజ మండలం సంకాపురం గ్రామానికి చెందిన ప్రేమలత శనివారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

## కార్యకర్తలకు అండగా గులాబీ జెండా

- నిరంతర అభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయం
- స్వరాష్ట్రంలోనే ప్రగతి పథంలో పల్లెలు
- కులరాజకీయాలతో జాగ్రత్తగా ఉండాలి
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, నవంబర్ 4 : బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి కార్యకర్తకూ గులాబీ జెండా అండగా ఉంటుందని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండలం పుటాన్‌పల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు సుదర్శన్‌రెడ్డి, రత్నంరెడ్డి, కోటేశ్‌రెడ్డి, నరసింహులు, బీసన్న, వెంకటేశ్, భాస్కర్‌రెడ్డి, అశోక్, శ్రీనుతోపాటు 80మంది, గట్టు మండలం ఇందువాసికి చెందిన అలీ, ఆంజనేయులు, వీరేశ్, నర్సింహులు, గూడు హనుమయ్య, శ్యాంకుమార్, జవహర్‌తోపాటు 50మంది, చిన్నోనిపల్లికి చెంది హనుమంతురెడ్డి, ముద్దిరెడ్డి, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డితోపాటు 20మంది, కౌన్సిలర్ నరహరిగౌడ్ ఆధ్వర్యంలో గద్వాల మున్సిపాలిటీలోని 18, 30వ వార్డుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రంగన్న, నరేందర్, ఈశ్వర్, శివ, కార్తీక్, బాషా, లక్ష్మణ్, ఆకాశ్, శశిగౌడ్, నరేశ్, శ్రావణ్‌తోపాటు 60మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడిపోయాయని, స్వరాష్ట్రంలో పల్లెలన్నీ ప్రగతి పథంలో పయనిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో కొందరు కుల రాజకీయాలు చేస్తూ ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరంతర అభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కొందరు పగటి వేషగాళ్ల రూపంలో ఓట్లు అడగడానికి వస్తుంటారని, ఆ తర్వాత వారు ముఖం చాటేస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, నాయకులు సలాం, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సంజీవులు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసే వారినే ఆదరించండి

- ప్రతిపక్షాలను నమ్మొద్దు: అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం
- క్యాతూర్‌లో విస్తృత ప్రచారం



ఎమ్మెల్యే అబ్రహంకు మద్దతు తెలుపుతున్న క్యాతూర్ గ్రామస్తులు

అలంపూర్, నవంబర్ 4 : నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం రాత్రి క్యాతూర్ గ్రామంలో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు అధికారం కోసం చెప్పే గ్యారెంటీలను నమ్మొద్దని సూచించారు. అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉంచి కార్తు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు అజయ్, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.